సాక్షి
ఆదిలాబాద్

మంగళవారం। 23। జూలై। 2024



ఆల్ ది బెస్ట్..

కైలాస్‌నగర్: జిల్లాకు చెందిన 105 మంది డీఎస్సీ అభ్యర్థులకు ఖమ్మం జిల్లాలో పరీక్ష కేంద్రాలు అలాట్ అయ్యాయి. వారంతా సోమవారం రెండు ప్రత్యేక బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. అభ్యర్థులకు డిపో మేనేజర్ కల్పన గులాబీ పూలు అందించి ఆల్ ది బెస్ట్ తెలిపారు.



సర్కారు బడుల్లో శిక్షా సప్తాహ్

నూతన విద్యావిధానం అమలులోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా అన్ని సర్కారు బడుల్లో ఈనెల 29 వరకు శిక్షా సప్తాహ్ నిర్వహిస్తున్నారు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.0/24.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

అమరవీరుల స్మృతివనం డిజైన్ ఖరారు



డిజైన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

కైలాస్‌నగర్: అమరవీరుల స్మృతివనంతో పాటు నాగోబా ఆలయం, కుంటాల జలపాతం వద్ద అభివృద్ధి పనులకు సంబంధించిన డిజైన్లను ఖరారు చేసినట్లు కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఇంజినీరింగ్ అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నాగోబా ఆలయ నిర్మాణ పనుల్లో భాగంగా జాతరకు ముందే అన్నదాన సత్రం పూర్తి చేయాలన్నారు. అలాగే ఎకో రిసార్ట్ కుంటాల జలపాతం వద్ద ఐదెకరాల్లో ఎనిమిది కాటేజీలు, రిసెప్షన్ సెంటర్, డైనింగ్, పార్కింగ్, గెస్ట్‌హౌస్, పార్కు తదితర అంశాలపై డిజైనర్ ప్రశాంత్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. డిజైన్లను ఫైనల్ చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో ట్రెయినీ కలెక్టర్ అభిజ్ఞాన్ మల్వియా, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ రాథోడ్ భీంరావు, ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలి

కైలాస్‌నగర్: ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. కలెక్టర్ సమావేశ మందిరంలో సోమవారం వ్యవసాయ, హార్టికల్చర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ ఏడాది జిల్లాలో రెండువేల ఎకరాల్లో ఆయిల్ పామ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇచ్చోడ, బోథ్, బజార్‌హత్నూర్, నేరడిగొండ, సిరికొండ మండలాల్లో 500 ఎకరాల్లో, గుడిహత్నూర్, ఇంద్రవెల్లి, ఉట్నూర్, నార్నూర్, తలమడుగు, తాంసి, భీంపూర్‌లలో 900 ఎకరాల్లో, ఆదిలాబాద్‌రూరల్, ఆదిలాబాద్‌అర్బన్, మావల, జైనథ్, బేలలో 600 ఎకరాల్లో ఈ పంట సాగు చేసే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇందులో జిల్లా వ్యవసాయఅధికారి పుల్లయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో సౌకర్యాల కల్పనకు కృషి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌టౌన్: స్పోర్ట్స్ స్కూల్‌లో సౌకర్యాలు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని క్రీడా పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. అక్కడ ఉన్నసౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాలలో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నా రు. ఉపాధ్యాయులు, సిబ్బంది కొరతతో నాణ్యమైన బోధన అందకుండా పోతుందని పేర్కొన్నారు. రెగ్యులర్ సిబ్బంది ని యామకం విషయాన్ని ప్రిన్సిపల్ సెక్రెటరీ, ఎండీ దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు.

ట్రెజరీ శాఖలో పలువురి బదిలీ

కైలాస్‌నగర్: జిల్లా ట్రెజరీ శాఖలో పనిచేస్తున్న 13 మందికి స్థానచలనం కలిగింది. నాలుగేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారిని బదిలీ చేస్తూ సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. బదిలీ అయిన వారి వివరాలివి.

అధికారి	పనిచేస్తున్న స్థానం	బదిలీ స్థానం
ఎస్టీవో		
యు.రాఘవేందర్	ఆదిలాబాద్	ఉట్నూర్
ఆర్.గంగాధర్	నిర్మల్	ఆదిలాబాద్
సీనియర్ అసిస్టెంట్లు		
సుప్రజాదేవి	ఆదిలాబాద్	బోథ్
స్రవంతి	ఆదిలాబాద్	ఉట్నూర్
అమరవాణి	ఆదిలాబాద్	ఉట్నూర్
గౌతమి	బోథ్	ఆదిలాబాద్
జూనియర్ అసిస్టెంట్లు		
గజానన్	ఆదిలాబాద్	బోథ్
ప్రవీణ్	బోథ్	ఉట్నూర్
ఇందిరా	ఉట్నూర్	ఆదిలాబాద్
క్యాషియర్		
సుష్మా	ఆదిలాబాద్	బోథ్
అన్నపూర్ణ	బోథ్	ఆదిలాబాద్
ఆఫీస్ సబార్డినేట్లు		
గఫార్	ఆదిలాబాద్	బోథ్
రేఖ	బోథ్	ఆదిలాబాద్



నిర్మలమ్మ దయచూపేనా..?

- నేడే కేంద్ర బడ్జెట్
- జిల్లాపై వరాలు కురిపించేనా..
- అసెంబ్లీ సమావేశాలూ నేటి నుంచే
- ఎంపీ, ఎమ్మెల్యేలు సమస్యలపై ప్రస్తావించేనా..

సాక్షి,ఆదిలాబాద్: నేడే కేంద్ర బడ్జెట్. రాష్ట్ర శాసనసభ సమావేశాలు కూడా షురూ కానున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లాకు ఒనగూర్చే ప్రయోజనాలపై ఈ ప్రాంతవాసులు ఆశగా ఎదురు చూస్తున్నారు. కేంద్రబడ్జెట్‌లో భాగంగా జిల్లాకు దక్కే వరాల ప్రకటనపైనే సర్వత్రా ఆసక్తి నెలకొంది. మరోపక్క నేటినుంచి ప్రారంభం కానున్న రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో నియోజకవర్గ సమస్యలను ప్రస్తావిస్తామని ఈ ప్రాంత ఎమ్మెల్యేలు పేర్కొంటున్నారు. అలాగే ఈ నెల 25న కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టనుండగా, అందులో జిల్లాకు ప్రయోజనాలు దక్కేలా పొందుపర్చాలని కోరుతున్నారు.

కేంద్ర బడ్జెట్‌పై ఆశలు..

దేశంలో నరేంద్రమోదీ మూడోసారి ప్రధానమంత్రిగా కొలువుదీరిన తర్వాత పార్లమెంట్‌లో ప్రవేశపెడుతున్న తొలి బడ్జెట్ కావడంతో ఈ ప్రాంతంలోని ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ప్రధానంగా ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి 2019, 2024లో వరుసగా బీజేపీ ఎంపీలను గెలిపించడం ద్వారా ఈ ప్రాంతంలో కేంద్రం దృష్టి సారించి పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తుందన్న ఆశాభావంతో ఉన్నారు. అలాగే ఆదిలాబాద్ నుంచి పఠాన్‌చెరు వరకు రైల్వే మార్గానికి ఈ బడ్జెట్‌లోనైనా ఏదైన స్పష్టత వస్తుందా అని జనం ఎదురుచూస్తున్నారు. దశాబ్దాలుగా ఈ ప్రాజెక్టు సాధన కోసం ఈ ప్రాంతవాసులు ఉద్యమిస్తున్నారు. ఆదిలాబాద్ నుంచి వయా నిర్మల్, ఆర్మూర్ మీదుగా పఠాన్‌చెరు వరకు రైల్వే మార్గానికి ఈ బడ్జెట్‌లో స్పష్టత వస్తే ప్రజలకు ఊరట లభించే అవకాశం ఉంది. అలాగే ఆదిలాబాద్ రైల్వేస్టేషన్‌లో నూతనంగా నిర్మిస్తున్న పిట్‌లైన్ పనులు త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలనే డిమాండ్ వ్యక్తమవుతుంది. తద్వారా ఇక్కడినుంచి రైళ్లు నడిపించేందుకు ఆస్కారం ఏర్పడుతుందని ప్రజలు ఆశిస్తున్నారు. అదేవిధంగా ఆదిలాబాద్ నుంచి గడ్‌చందూర్ నూతన రైల్వే మార్గాన్ని నిర్మిస్తే ఇది ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్, ఆసిఫాబాద్‌లకు అనుసంధానమై ప్రయోజనం దక్కుతుందని భావిస్తున్నారు. ఆదిలాబాద్ నుంచి కాజీపేట వరకు వయా మాజిరి, బల్లార్షా, సిర్పూర్ కాగజ్‌నగర్, మంచిర్యాల మీదుగా ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు నడపాలనే డిమాండ్ ఉంది. బాసర రైల్వేస్టేషన్‌లో అమరావతి నుంచి తిరుపతికి బై వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం నుంచి షిరిడీ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్ నుంచి జైపూర్ బై వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, రామేశ్వరం నుంచి ఓఖా వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, జైపూర్ నుంచి కర్నూల్ సిటీ వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలుపాలనే డిమాండ్ ఉంది. వీటితో పాటు ఆదిలాబాద్ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు మొదలయ్యాయి. వాటిని త్వరితగతిన పూర్తి చేయాలనే డిమాండ్ ఉంది. అలాగే జిల్లా కేంద్రంలో ఎయిర్‌పోర్ట్ లేనిపక్షంలో ఎయిర్ ఫోర్స్ నిర్మించాలని డిమాండు దశాబ్దాలుగా ఉంది. దీనిపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలని అభిప్రాయం ప్రజాప్రతినిధులనుంచి వ్యక్తం అవుతుంది.

ఎంపీ నగేశ్ ఫోన్ స్విచాఫ్..!

బీజేపీ ఆదిలాబాద్ ఎంపీ గొడం నగేశ్ పార్లమెంట్ సమావేశాలకు సంబంధించి ప్రస్తావించే అంశాల విషయంలో ఈ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఇదిలా ఉంటే రెండు రోజులుగా ఎంపీ ఫోన్ స్విచ్ ఆఫ్‌గా ఉంది. దీంతో పార్లమెంట్‌లో ప్రస్తావించే అంశాల విషయంలో స్పష్టత రాలేదు. ఇదిలా ఉంటే ఈ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యేలతో ఆయన ఏదైనా చర్చించారా అనే విషయంలోనూ తెలియరాలేదు.

నేటి నుంచే అసెంబ్లీ సమావేశాలు..

నేటి నుంచి రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు షురూ కానున్నాయి. ఈనెల 25న కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతుంది. ఈ సమావేశాల ద్వారా నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యలను ప్రస్తావించడమే కాకుండా బడ్జెట్‌లో జిల్లాకు ప్రయోజనం దక్కేలా చూస్తామని ఎమ్మెల్యేలు పేర్కొంటున్నారు.

కొరటా-చనాఖా పూర్తిచేయాలి



కొరటా–చనాఖా ప్రాజెక్టును పూర్తి చేయాలి. అలాగే ఆదిలాబాద్ పట్టణంలో నిర్మిస్తున్న ఆర్‌వోబీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ కోటా నిధులు విడుదల చేయాలి. ఏయిర్‌ఫోర్స్ స్టేషన్‌కు సంబంధించి భూములకు ఎన్‌వోసీ ఇవ్వాలని గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరవడం జరిగింది. దానికి సంబంధించి స్పష్టతనివ్వాలని ఆశిస్తున్నాం.

– పాయల్ శంకర్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే

బోథ్ రెవెన్యూ డివిజన్ చేయాలి



బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఉన్నతీకరించాలి. కుప్టి ప్రాజెక్టును నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలి. బోథ్ ఆస్పత్రిని వంద పడకలకు విస్తరించాలి. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 70 శాతం టీచర్లు లేరు. దీంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదు.

– అనిల్ జాదవ్, బోథ్ ఎమ్మెల్యే

పోడు పట్టాలివ్వాలి..



పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని మరోసారి కోరనున్నాం. అటవీ అధికారుల నుంచి ఈ విషయంలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వీటిని ప్రస్తావిస్తా. అలాగే గిరి జన ప్రాంతాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే విషయంలో ప్రభుత్వం దృష్టి సారించాలి.

– వెడ్మ బొజ్జు, ఖానాపూర్ ఎమ్మెల్యే

రోడ్ల సమస్య తీవ్రంగా ఉంది



కుమురంభీం జిల్లాలో మారుమూల ప్రాంతాలు అధికంగా ఉన్నాయి. రహదారుల సమస్య తీవ్రంగా ఉంది. గుంతలమయంగా మారాయి. ప్రభుత్వం రోడ్ల నిర్మాణంపై దృష్టి సారించి చర్యలు చేపట్టాలి. అటవీ క్లియరెన్స్ లేక అనేక ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయి. లోలెవల్ వంతెనలను హైలెవల్‌గా మార్చాలని కోరుతున్నప్పటికీ ప్రయోజనం దక్కడం లేదు.

– కోవ లక్ష్మి, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే

పారిశుధ్య సమస్యలా.. సంప్రదించండి



ఖమర్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్

కైలాస్‌నగర్: ప్రస్తుతం వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. పట్టణంలోని ఖాళీగా ఉన్న ప్లాట్లలో పిచ్చి మొక్కలు పెరుగడంతో పాటు, చెత్తాచెదారం పేరుకుపోతోంది. డ్రెయినేజీలు, రోడ్లపై మురుగునీరు నిలిచి పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారుతోంది. దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముంది. ఈ నేపథ్యంలో పట్టణ ప్రజలు పడుతున్న ఇబ్బందులు పరిష్కరించేలా ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్ ఎండీ.ఖమర్ అహ్మద్‌తో ఈ నెల 23న 'సాక్షి ఫోన్ ఇన్' నిర్వహిస్తోంది. జిల్లా కేంద్రం వాసులు తమ సమస్యలను ఈ కార్యక్రమం ద్వారా ఆయన దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చు.

సమయం: ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు

సంప్రదించాల్సిన సెల్ నంబర్: 98488 90171

అమృత్ 2.0.. ఇంకెప్పుడో?

- పూర్తయిన టెండర్ల ప్రక్రియ
- పనుల ప్రారంభంలో మాత్రం జాప్యం
- దృష్టి సారించని పాలకులు

తాగునీటి పనుల కోసం వెచ్చించాల్సిన వ్యయం వాటాల వివరాలిలా..(రూ.కోట్లలో)

కేంద్రం	రాష్ట్రం	బల్దియా	15వ ఆర్థిక సంఘం
29.50	52.42	7.01	6.57



పైపులైన్ (ఫైల్)

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపాలిటీలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కరించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 పథకం కింద రూ. 95.50 కోట్ల నిధులు విడుదల చేసింది. గతేడాది అసెంబ్లీ ఎన్నికల కారణంగా నిలిచిపోయిన పనులను చేపట్టేందుకు ఈ ఏడాది ఫిబ్రవరిలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక అనుమతి కూడా ఇచ్చింది. ఈ పనుల నిర్వహణకు సంబంధించి ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తయింది. నిధులు సైతం మంజూరయ్యాయి. అయినా పనుల ప్రారంభంపై అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

14 నెలల క్రితం నిధుల మంజూరు

రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రజలకు అవసరమైన తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 పథకం కింద 2023 మే 20న నిధులను మంజూరు చేసింది. ఇందులో భాగంగా ఆదిలాబాద్ మున్సిపాలిటీకి రూ.95.50 కోట్లు కేటాయిస్తూ జీవో నంబర్ 312ను జారీ చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పాటు బల్దియా కూడా తమ వాటా చెల్లించి తాగునీటి పనులు చేపట్టేలా మార్గదర్శకాలు జారీ చేసింది. అప్పుడే పనులు ప్రారంభించాల్సి ఉండగా టెండర్ల దాఖలకు కాంట్రాక్టర్లు ఆ సమయంలో ముందుకు రాలేదు. దీంతో ఈ ప్రక్రియకు బ్రేక్ పడింది. గతేడాది డిసెంబర్‌లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కొద్ది రోజుల పాటు ఈ పనులను నిలిపివేసింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో తిరిగి చేపట్టేందుకు అనుమతినిచ్చింది. పనులు ప్రారంభమవుతాయని ప్రజలు సంబరపడ్డారు. అయితే ఇప్పటికి ఎలాంటి ప్రగతి లేకపోవడం గమనార్హం.

టెండర్ల ప్రక్రియ పూర్తయినా..

పట్టణంలోని ప్రతీ వ్యక్తికి రోజుకు 135 లీటర్ల నీటిని అందించాలనే ఉద్దేశంతో పనులు చేపట్టేలా ప్రణాళిక సిద్ధం చేశారు. తాగునీటి సమస్య ఉన్న పట్టణంలో కొత్తగా విలీనమైన కేఆర్‌కే కాలనీ, భగత్‌సింగ్‌నగర్, న్యూ హౌసింగ్‌బోర్డు, రాంపూర్ వంటి కాలనీల్లో వాటర్ ట్యాంకుల నిర్మాణాలతో పాటు తాగునీటి సరఫరాకు అవసరమైన పైపులైన్లు, నల్లా కనెక్షన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మున్సిపల్ పరిధిలోని పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ విభాగం ద్వారా ఏయే కాలనీల్లో ఎలాంటి పనులు చేపట్టాలనే దానిపై ప్రతిపాదనలు సిద్ధం చేసిన అధికారులు ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో రాష్ట్ర స్థాయిలోనే టెండర్ల ప్రక్రియ ఖరారు చేసినట్లుగా చెబుతున్నారు. నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభించకపోవడంలో ఆంతర్యమేమిటనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఏడాది వేసవిలోనూ ఆయా ఆయా కాలనీల ప్రజలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా త్వరగా పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

త్వరలోనే ప్రారంభిస్తాం

అమృత్ 2.0 పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తయింది. త్వరలోనే జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క చేతుల మీదుగా పనులకు భూమి పూజ నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. మరో పది, పదిహేను రోజుల్లోగా ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

– గంగాధర్, పబ్లిక్ హెల్త్, ఈఈ

అర్జీలు పెండింగ్‌లో ఉంచొద్దు

- అధికారులకు కలెక్టర్ రాజర్షి షా ఆదేశం
- 'గ్రీవెన్స్'లో దరఖాస్తుల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: ప్రజావాణిలో అందించే అర్జీలు పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించేలా శ్రద్ధ వహించాలని కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ట్రెయినీ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియాతో కలిసి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వారి నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. బాధితుల సమస్యలు అడిగి తెలుసుకొని, వాటిని సంబంధిత అధికారులకు అందజేస్తూ పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే పెండింగ్ దరఖాస్తుల వివరాలు ప్రజావాణి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ వారం మొత్తం 103 అర్జీలు అందినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్, ఉట్నూర్ ఆర్డీవోలు వినోద్‌కుమార్, జీవాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ వారం అర్జీదారుల్లో కొందరి నివేదన..

పట్టా పాస్‌బుక్ ఇప్పించండి..



మా గ్రామంలోని సర్వేనంబర్ 60/అ3లో నివాసగృహాలు ఉన్నాయి. అయితే సర్వేనంబర్ 49/ఇ2లోని 2.7 ఎకరాల మా వ్యవసాయ భూమిని కూడా ఆన్‌లైన్ రికార్డుల్లో నివాసగృహాలు ఉన్నట్లుగా చూపించారు. కానీ అక్కడ ఎలాంటి నివాసగృహాలు లేక పోగా ఏళ్లుగా అందులో మేం వ్యవసాయం చేస్తున్నాం. అధికారులు ఆన్‌లైన్‌లో తప్పుగా నమోదు చేయడంతో ధరణి పట్టా పాస్ బుక్ రాలేదు. దీంతో మా ఎలాంటి ప్రభుత్వ ప్రయోజనాలు అందడం లేదు. దీనిపై విచారించి పట్టా పాస్ పుస్తకం జారీ చేసి న్యాయం చేయాలి.

– బింగి పొచ్చన్న, లేఖర్‌వాడ, జైనథ్

పట్టించుకోవడం లేదు..



మా గ్రామంలోని సర్వేనంబర్‌లో 30లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఏళ్ల క్రితం మూడెకరాల భూమి అందించింది. 20 ఏళ్లుగా ఆ భూమిని సాగు చేసుకుంటున్నాను. అయితే ఇప్పటి వరకు కూడా అధికారులు పట్టా ఇవ్వ లేదు. మండల రెవెన్యూ అధికారులను కలిసి ఎన్ని సార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. పట్టా లేకపోవడంతో ప్రభుత్వమందించే ప్రయోజనాలు పొందలేకపోతున్నా.

– వి.అడెల్లు, అర్లి–బి, ఆదిలాబాద్ రూరల్

కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

మండల కేంద్రంలోని సర్వేనంబర్ 21లో గల ఐటీడీఏ పరిధిలో గల గిరిజన కోఆపరేటివ్ సంస్థకు సంబంధించి డీఆర్‌పీవోకు చెందిన 10 గుంటల స్థలాన్ని కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు కబ్జా చేశారు. కోట్లాది రూపాయల స్థలాన్ని కబ్జా చేసి అందులో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారు. దీనిపై విచారణ జరిపించి ప్రభుత్వ భూమి కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకోవాలి.

– చందర్ షా, మహ్మద్, బేల



మాకేవి పదోన్నతులు

- ఏడేళ్లుగా విద్యుత్ శాఖలో నో ప్రమోషన్స్
- రిటైర్మెంట్ సమీపిస్తుందని ఉద్యోగుల్లో ఆందోళన



జిల్లా కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయం

ఆదిలాబాద్‌టౌన్: విద్యుత్‌శాఖలో ఏళ్లుగా పదోన్నతులు లేకపోవడంతో ఆ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు నిరాశకు గురవుతున్నారు.ఒకే కేటగిరిలో ఏళ్లుగా పనిచేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏడేళ్లుగా ప్రమోషన్లు చేపట్టకపోవడంతో రిటైర్మెంట్‌కు సమీపిస్తున్నామని ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వం రిటైర్మెంట్ వయస్సు 61 ఏళ్లకు పెంచింది. కానీ పదోన్నతులు మరిచిందని ఆ శాఖ ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈఏడాది ఏప్రిల్ నుంచి ఉద్యోగ విరమణ ప్రారంభమైంది. రిటైర్మెంట్ అవుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ప్రమోషన్లు కల్పిస్తే నిరుద్యోగులకు సైతం ఉపాధి అవకాశాలు లభిస్తాయని వారు పేర్కొంటున్నారు.

కోర్టు కేసులతో..

పదోన్నతులకు సంబంధించి కోర్టులో కేసు నడుస్తుండడంతో విద్యుత్ శాఖ ఈ ప్రక్రియ చేపట్టడం లేదు. మెరిట్ కమ్ సీనియారిటీ ప్రకారం పదోన్నతి కల్పించాలని కోర్టు ఇచ్చిన ఆదేశాలను అప్పటి విద్యుత్ సంస్థ అమలు చేయలేదని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. కొన్నేళ్లుగా కోర్టులో కేసు పెండింగ్‌లో ఉండడంతో తాము పదోన్నతులు పొందే అవకాశాన్ని కోల్పోతున్నామని, ఈ విషయంలో ప్రభుత్వం చొరవ తీసుకొని తమకు పదోన్నతులు కల్పించాలని ఆ శాఖ ఉద్యోగులు కోరుతున్నారు. గత ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వమైనా తమ గోడు పట్టించుకొని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కండీషన్‌పై అయినా పదోన్నతులు కల్పించాలని విన్నవిస్తున్నారు. ఈ విషయంలో సీఎం చొరవ తీసుకోవాలని ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి.

ఆదిలాబాద్ సర్కిల్‌లో పోస్టులు, ప్రస్తుతం పనిచేస్తున్నవారు, ఖాళీల వివరాలు

పోస్టులు	మంజూరు	పనిచేస్తున్నవారు	ఖాళీలు
డీఈ	5	4	1
ఏడీఈ	11	4	7
ఏఈ, అసిస్టెంట్ ఏఈ	35	30	5
సబ్ ఇంజనీర్	32	23	9
ఏఏఓ	5	1	4
పీఓ	1	-	1
జేఏవో	17	16	1
సీనియర్ అసిస్టెంట్	21	18	3
మొత్తం	127	96	31

పదోన్నతులు లేక నిరాశ..

ఏడేళ్లుగా విద్యుత్ శాఖలో పదోన్నతులు లేవు. దీంతో చాలా మంది నిరాశకు గురవుతున్నారు. గత ప్రభుత్వం మూడేళ్ల రిటైర్మెంట్ వయస్సును పొడిగించింది. ఈ క్రమంలో ఈ ఏప్రిల్ నుంచి ఉద్యోగులు విరమణ పొందుతున్నారు. దీంతో ఖాళీలు ఏర్పడుతున్నాయి. పదోన్నతులు కల్పిస్తే ఉద్యోగులు మేలు చేకూరడంతో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

– పి.విలాస్, టీఈఈ 1104 యూనియన్, జిల్లా అధ్యక్షుడు

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన

- కలెక్టరేట్ ఎదుట మున్సిపల్ కార్మికులు, 'ఆశ'ల ధర్నా



ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కైలాస్‌నగర్: తమ సమస్యలు పరిష్కరించాలంటూ మున్సిపల్ కార్మికులు, ఆశ కార్యకర్తలు సోమవారం ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట వేర్వేరుగా ధర్నా నిర్వహించారు. మున్సిపల్ కార్మికులు ఏఐటీయూసీ అనుబంధ మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ మాట్లాడుతూ.. ప్రజారోగ్యాన్ని పరిరక్షించే మున్సిపల్ కార్మికులకు రూ.26వేల కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే మరణించిన కార్మికుల అంత్యక్రియల కోసం రూ.20వేలు చెల్లించాలన్నారు. బల్దియాలో ఖాళీగా ఉన్న పోస్టులు వెంటనే భర్తీ చేయాలని, ఇందులో పారిశుధ్య కార్మికులకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. ఇందులో సంఘం నాయకులు గజంగుల రాజు, చిరంజీవి, అశోక్, పొచ్చిరాం, నారాయణ రెడ్డి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో 'ఆశ'లు..

ఆశల సమస్యలను అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో చర్చించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిరణ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ఆశాలు తమ సమస్యలను పరిష్కరించాలంటూ నినదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆశా కార్యకర్తలందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు రూ.18వేల కనీస వేతనం చెల్లించాలన్నారు. అనంతరం కలెక్టర్ రాజర్షి షాను కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఇందులో సంఘ నాయకులు శోభ, పద్మ, ఉమా, అరుణ, కాంత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వర్షానికి కూలిన ఇల్లు



ఇంటి ఎదుట బాధిత కుటుంబ సభ్యులు

కడెం: ఇటీవల కురుస్తున్న వర్షాలకు సోమవారం మండలంలోని కన్నాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని చిన్నక్యాంప్ గ్రామానికి చెందిన సంఘం మల్లేశ్ ఇల్లు కూలిపోయింది. సంఘటన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఇల్లు కూలిపోవడంతో రోడ్డున పడ్డామని, ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత కుటుంబం వేడుకుంటోంది.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

ఖానాపూర్: పట్టణంలోని పద్మావతినగర్ కాలనీలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. కాలనీకి చెందిన మాలకొండయ్య ఇటీవల ఇంటికి తాళం వేసి ఆంధ్రాలో ఉన్న తన స్వగ్రామానికి వెళ్లాడు. గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు ఇంటితాళం పగులగొట్టి బీరువాలో ఉన్న 5 మాసాల బంగారం ఎత్తుకెళ్లినట్లు ఎస్సై లింబాద్రి తెలిపారు. మాలకొండయ్యకు వరుసకు సోదరుడైన చిన్నబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అదే కాలనీలోని కామోజి శ్రీనివాస్‌తో పాటు చిలుకూరి విజయప్రకాశ్‌లకు చెందిన మరో రెండిళ్లలో సైతం చోరీకి యత్నించినట్లు ఆయన పేర్కొన్నారు. సోమవారం సీఐ సైదారావు ఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. కాగా విజయప్రకాశ్ ఇంటి ఆవరణలోని సీసీ పుటేజిలో నిందితుడు చోరీకి యత్నించిన పుటేజిని సేకరించినట్లు తెలిపారు.

గడ్‌చాందలో పట్టపగలే..

లోకేశ్వరం: మండలంలోని గడ్‌చాందలో పట్టపగలే చోరీ జరిగిందని ఏఎస్సై దిగంబర్ తెలిపారు. గ్రామానికి చెందిన అంబకంటి లావణ్య ఆదివారం ఉదయం ఇంటికి తాళం వేసి ముధోల్ వెళ్లింది. సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరి కి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా సామగ్రి చిందరవందర చేసి ఉంది. బీరువాలో ఉన్న 35 గ్రాముల బంగారం, రూ.20 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

గుట్కా పట్టివేత

ఇంద్రవెల్లి: మండలంలోని శంకర్‌గూడలో నర్వటే ఆకాష్ పాన్‌షాపు వద్ద సోమవారం రూ.29,600 విలువైన గుట్కా పట్టుకున్నట్లు ఎస్సై దుబ్బక సునీల్ తెలిపారు. గుట్కాను స్వాధీనం చేసుకుని ఆకాష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

14 మందిపై కేసు

నేరడిగొండ: ఇస్పూర్‌లో ఇంటి దగ్గర దారి విషయంలో ఇరు వర్గాల మధ్య గొడవ చోటు చేసుకుంది. సోమవారం ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 14 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని జాతీయ రహదారి 44పై కారును బస్సు ఢీకొన్న ఘటనలో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై జహీరుద్దీన్ తెలిపారు. మహారాష్ట్రకు చెందిన మహమ్మద్ ఏకే శ్యాం సోమవారం బోరి నుంచి కిన్వట్‌కు వెళ్తుండగా జీఎంఆర్ ఆయిల్ సాల్వెంట్ సమీపంలో కారును ప్రైవేట్ బస్సు ఢీకొట్టింది. దీంతో కారు వెనుకభాగం దెబ్బతింది.

వాహనం ఢీకొని జింక మృతి

ఇచ్చోడ: మండలంలోని కుప్టిఘాట్ సమీపంలో 44వ జాతీయ రహదారిపై సోమవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక మృతి చెందింది. సంఘటన స్థలానికి పశువైద్యాధికారి గోవింద్‌నాయక్ వెళ్లి పంచనామా నిర్వహించారు.

సర్కారు బడుల్లో శిక్షా సప్తాహ్

- వారం రోజులపాటు వివిధ కార్యక్రమాల నిర్వహణ
- విద్యార్థుల్లో వినోదం, విజ్ఞానం పెంచేలా ప్రత్యేక ప్రణాళిక

ఆదిలాబాద్‌టౌన్/మంచిర్యాలఅర్బన్/నిర్మల్‌ఖిల్లా: నూతన విద్యావిధానం అమలులోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా అన్ని సర్కారు బడుల్లో సోమవా రం నుంచి ఈనెల 29 వరకు శిక్షా సప్తాహ్ (విద్యావారోత్సవాలు) నిర్వహిస్తున్నారు. వారం రోజుల పాటు రోజుకో విధంగా కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఇందుకోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. బోధనకు ఆటంకం కలుగకుండా కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులు ఉపాధ్యాయులను ఆదేశించారు. అయితే ఈ కార్యక్రమాలకు సంబంధించి తీసిన ఫొటోలకు జియో ట్యాగింగ్ చేయాలని సూచించారు. వీటిని గూగుల్ డ్రైవ్‌లో అప్‌లోడ్ చేయాలని సమగ్ర శిక్షా అభియాన్ అధికారులు పేర్కొంటున్నారు. విద్యార్థుల్లో వినోదంతో పాటు విజ్ఞానం పెంపొందించేలా కార్యక్రమాలు రూపొందించేందుకు చర్యలు చేపడుతున్నారు.

రోజువారీ కార్యక్రమాలు ఇవే..

శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా రోజుకో విధమైన కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఉమ్మడి జిల్లాలోని ఆయా పాఠశాలల్లో నీటిని ఆదా చేయడం, ఇతరులకు సహాయం చేయాలనే అంశంపై టీఎం మేళా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆహారం, కూరగాయలు, వ్యర్థాలతో బొమ్మల తయారీని చార్ట్‌ల రూపంలో ప్రదర్శించారు.

- 23న పాఠశాలల్లో అమలు చేస్తున్న న్యూమరసీ ఫండమెంటల్ లిట్రసీ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించనున్నారు. ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమానికి సంబంధించి ఉపాధ్యాయుల బోధన పద్ధతులను ప్రదర్శించనున్నారు. సదస్సులు నిర్వహించి విద్యార్థులకు కథలు చెప్పాల్సిఉంటుంది.
- 24న క్రీడా దినోత్సవం నిర్వహించాలి. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ఆటలు ఆడించడం, క్రీడలతో కలిగే ప్రయోజనాలు వివరించనున్నారు.జట్టు ఆడే ఆటల్లో ఫలితాలు విజయం దిశగా ఉంటాయని, క్రీడలతో మానసిక ఎదుగుదల, శారీరక దృఢత్వం గురించి తెలియజేయనున్నారు.
- 25న సాంస్కృతిక దినోత్సవం నిర్వహించాలి. ఇందులో భాగంగా వివిధ భాషలు, వేషధారణ, సంస్కృతి, సంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి. వస్త్రధారణ, చిత్రలేఖనం, జానపద, నాటకాలు విద్యార్థులతో వేయించాలి. ఏకపాత్రాభినయం, పాటల పోటీలు నిర్వహించాలి.
- 26న సాంకేతిక నైపుణ్య దినోత్సవం నిర్వహించాల్సి ఉంది. ఇందులో కోడింగ్ ఛాలెంజ్, జీవధారణ కార్యక్రమాలు, పక్షు, జంతువులపై అవగాహన, విద్యార్థులకు చారిత్రక విషయాలను తెలియజేయడం, వర్క్‌షాప్ నిర్వహించాల్సి ఉంటుంది. విద్యార్థులను చారిత్రాత్మక ప్రదేశాలకు తీసుకెళ్లి వాటి గురించి వివరిస్తారు.
- 27న పాఠశాలల్లో పౌష్టికాహార దినోత్సవం నిర్వహించాలి. విద్యార్థులతో ఏకో క్లబ్‌లను ఏర్పాటు చేయాలి. క్లబ్‌ల ద్వారా పలు కార్యక్రమాలు నిర్వహించేలా చూడాలి. మొక్కల పెంపకం, కూరగాయల తోటల పెంపకం చేపట్టాలి. మొక్కలు నాటి వాటిని సంరక్షించేలా చూడాలి.
- 29న సామాజిక భాగస్వామ్య దినోత్సవం నిర్వహించాలి. అందర్నీ ఇందులో భాగస్వామ్యం చేయాలి. తల్లిదండ్రులు, దాతలను బడికి ఆహ్వానించి కార్యక్రమాలు చేపట్టాలి. పాఠశాలల్లో చేపడుతున్న కార్యక్రమాలు వివరించాలి. పాఠశాల అభివృద్ధిలో సమాజ భాగస్వామ్యం పెంపొందించేలా చర్యలు చేపట్టాలి.



ప్రదర్శనలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, విద్యార్థుల వివరాలు

జిల్లా	ప్రాథమిక	ప్రాథమికోన్నత	ఉన్నత	విద్యార్థులు
ఆదిలాబాద్	466	107	105	65,000
మంచిర్యాల	510	96	108	29,376
నిర్మల్	533	85	117	52,667
కుమురంభీం	560	102	58	36,000

తప్పనిసరిగా నిర్వహించాలి



జిల్లాలోని ప్రతీ పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలి. ఈ నెల 22 నుంచి 29 వరకు వారం రోజుల పాటు రోజుకో కార్యక్రమాలను చేపట్టాలి. విద్యార్థులకు అవగాహన కల్పించాలి. అమ్మ ఆదర్శ కమిటీలను, తల్లిదండ్రులు, దాతలను ఈ కార్యక్రమాల్లో భాగస్వాముల్ని చేయాలి. నిర్వహించిన కార్యక్రమాలకు సంబంధించి ఫొటోలు, వీడియోలకు జియో ట్యాగింగ్ చేయాలి. నివేదికను పంపించాలి.

– ప్రణీత, డీఈవో, ఆదిలాబాద్

విద్యార్థుల భాగస్వామ్యం తప్పనిసరి...



'శిక్షా సప్తాహ' వారోత్సవాల్లో ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రతీ విద్యార్థిని భాగస్వామ్యం చేసేలా ప్రోత్సహించాలి. రోజుకొక విభిన్న ఇతివృత్తంతో నిర్వహించే కార్యక్రమాల ద్వారా విద్యార్థులలో చైతన్యం రగిలించాలి. ఇందులో విద్యార్థులు సృజనాత్మకత, విభిన్న ఆలోచన శక్తిని పొందుతారు. ఏడు రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గ నిర్దేశం చేయాలి.

– డా.ఏ.రవీందర్‌రెడ్డి, డీఈవో, నిర్మల్

మంచిర్యాలలో..

గర్మిళ్ల పాఠశాలలో సోమవారం టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్ఎం) దినోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా వినూత్నంగా బోధన సామగ్రి తయారు చేయడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని టీఎల్ఎంగా మలుచుకోవడంతో పాటు విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. ఆహారం-కూరగాయలు అనే అంశంపై ప్రదర్శించారు.

బీఎడ్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో కొనసాగుతున్న బీఎడ్ కళాశాలలో 2024–26 విద్యా సంవత్సరానికి గానూ ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గణితంలో 25 సీట్లు, జీవశాస్త్రంలో 20, సాంఘిక శాస్త్రం 35 , భౌతిక రసాయన శాస్త్రం 10, ఆంగ్లం 10 సీట్లకు గానూ రాష్ట్రంలో అర్హతగల గిరిజన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ఫారాలను రూ. 100 చెల్లించి కళాశాల పనిదినములలో అభ్యర్థులు ఈనెల 24 నుండి వచ్చే నెల 23 వరకు పొందవచ్చన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులు ఆగస్టు 23 సాయంత్రం 5గంటలలోపు సమర్పించాలన్నారు. ఇతర వివరాలకు 94408 48073 నంబరులో సంప్రదించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల ఉంచి అర్జీలు స్వీకరించారు. జన్నారం మండలం కామన్‌పల్లికి చెందిన అమృత చికిత్స నిమిత్తం ఆర్థికసాయం అందించాలని, బజార్‌హత్నూర్ మండలం ముర్ధండికి చెందిన గంగ కారుణ్య నియామక ఉద్యోగం ఇప్పించాలని, తదితర సమస్యలపై దరఖాస్తులు అందజేశారు. కార్యక్రమంలో జీసీసీ మేనేజర్ రామానందన్, అదనపు వైద్యాధికారి మనోహర్ పాల్గొన్నారు.

గ్రంథాలయం సందర్శన

ఉట్నూర్ కేబీ ప్రాంగణంలోని హైమన్‌డార్ఫ్ గ్రంథాలయాన్ని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సందర్శించారు.

రిమ్స్‌లో బదిలీలు

- ఏడుగురు వైద్యులకు స్థానచలనం
- ఆ స్థానంలో కొత్త డాక్టర్లను నియమించని వైనం

ఆదిలాబాద్‌టౌన్: మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా మారింది రిమ్స్ ఆస్పత్రి పరిస్థితి. ఇప్పటికే వైద్యుల ఖాళీలతో సతమతం అవుతుండగా గతేడాది రిమ్స్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసిన అసిస్టెంట్ ప్రొఫెసర్లకు రెగ్యులర్ పోస్టులు రావడంతో దాదాపు 20 మంది రిమ్స్ నుంచి వెళ్లిపోయారు. ఇప్పుడేమో సాధారణ బదిలీల్లో భాగంగా ఏడుగురు వైద్యులు బదిలీ అయ్యారు. వారి స్థానంలో ఒక్క వైద్యుడిని కూడా కేటాయించకపోవడంతో రిమ్స్‌లో వైద్య సేవలకు ఆటంకం కలిగే పరిస్థితి ఏర్పడింది. వైద్యం పడకేయనుండగా, బోధన అటకెక్కే పరిస్థితి నెలకొంది. ఆయా విభాగాల ప్రొఫెసర్లను బదిలీ చేయడంతో ఇబ్బందులు తలెత్తనున్నాయి. కాగా ఈ బదిలీల్లో నలుగురు ప్రొఫెసర్లు, ముగ్గురు అసోసియేషన్ ప్రొఫెసర్లను డీఎంఈ బదిలీ చేసింది. వీరు రిలీవ్ అయిన తర్వాత ఇక్కడ రోగులతో పాటు వైద్య విద్యార్థులకు సైతం ఇబ్బందులు తలెత్తే పరిస్థితి ఏర్పడనుంది. ప్రస్తుతం 40 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలుస్తోంది. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాల్సిన ప్రభుత్వం ఉన్న వారిని ఇక్కడి నుంచి వేరే జిల్లాలకు బదిలీ చేయడం పట్ల జిల్లా ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బదిలీ జరిగిన పోస్టులతో పాటు ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఏడుగురికి స్థానచలనం..

ఆప్తాలమిక్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఇద్రిస్ అక్బానికి నిర్మల్ జిల్లా ప్రభుత్వ మెడికల్ కళాశాలకు బదిలీ చేశారు. ప్యాథాలజీ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న చంద్రశేఖర్ గాంధీ మెడికల్ కళాశాల హైదరాబాద్‌కు బదిలీ చేశారు. అనస్తీషియా విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఎస్.చంద్రశేఖర్‌ను ఉస్మానియా మెడికల్ కళాశాలకు, ఫార్మాకాలజీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న లక్ష్మీపతిని వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలకు, బయోకెమిస్ట్రీ అసోసియేషన్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ప్రజ్ఞను గాంధీ మెడికల్ కాలేజీకి, ఆర్థో విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న శ్యామ్‌ప్రసాద్‌ను నిర్మల్ ప్రభుత్వ మెడికల్ కళాశాలకు, జనరల్ మెడిసిన్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ సుమలతను నిర్మల్ మెడికల్ కళాశాలకు బదిలీ చేశారు.

ఆర్టీసీకి పెరిగిన ప్రజాదరణ

- ఉమ్మడి జిల్లాలో 3.57 కోట్ల మందికి 'జీరో' టికెట్లు
- ప్రయాణికుల సంఖ్యకనుగుణంగా బస్సులు
- కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక దృష్టి
- రీజినల్ మేనేజర్ సోలోమాన్



మాట్లాడుతున్న ఆర్ఎం సోలోమాన్

కైలాస్‌నగర్: ఆర్టీసీకి ప్రజల్లో ఆదరణ పెరిగిందని దీంతో ఆక్యుపెన్సీ రేషియో(ఓఆర్) 90శాతం నమోదవుతుందని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సోలోమాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గతేడాది డిసెంబర్‌లో మహాలక్ష్మి పథకం అమలు చేసినప్పటి నుంచి ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేవారి సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. రీజియన్‌లోని ఆరు డిపోల పరిధిలో 612 బస్సులుండగా నిత్యం 2.70 లక్షల మంది ప్రయాణికులు ప్రయాణిస్తున్నారన్నారు. ఇందులో 1.50 లక్షల మంది మహిళలు ఉంటున్నట్లుగా తెలిపారు. కొన్ని బస్సుల్లో 95 నుంచి 100శాతం ఓఆర్ నమోదవుతుందన్నారు. మహాలక్ష్మి పథకం ప్రారంభం నుంచి గడిచిన 218 రోజుల్లో 3కోట్ల 57లక్షల 54వేల 336 మంది మహిళలు ప్రయాణించగా వారికి జీరో టికెట్లు జారీ చేశామన్నారు. అలాగే డబ్బులు చెల్లించి 2కోట్ల 50లక్షల 59వేల172 మంది ప్రయాణించినట్లుగా తెలిపారు. ప్రయాణికుల సంఖ్యకనుగుణంగా బస్సులను నడుపుతున్నట్లుగా తెలిపారు. గతంలో కిలో మీటర్‌కు రూ.43.20 ఆదాయం రాగా, మహాలక్ష్మి అమలు నుంచి కిలో మీటర్‌కు రూ.57.28 ఆదాయం వస్తుందని చెప్పారు. ఆర్టీసీ కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తు గ్రాండ్ హెల్త్ చాలెంజ్ ట్రూ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు. ఇందులో భాగంగా కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆదిలాబాద్, మంచిర్యాలలోని డిస్పెన్సరీల్లో వైద్యసేవలందిస్తున్నట్లుగా తెలిపారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తార్నాకలోని ఆసుపత్రికి పంపిస్తున్నట్లుగా పేర్కొన్నారు. అక్కడ కొత్తగా ఎంఆర్ఐ, ఐసీయూ సేవలు కూడా అందుబాటులోకి వచ్చినట్లుగా తెలిపారు. కార్మికులు ప్రయాణికులతో మర్యాదగా నడుచుకుంటూ మరింత ఆదాయం పెంచేలా శ్రద్ధ వహించాలని కోరారు. ప్రయాణికులు కూడా సంస్థను ఆదరించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ వైర్లు పట్టుకుని ఆత్మహత్య

కుభీర్: మండలంలోని సిస్పెల్లి(హెచ్)గ్రామానికి చెందిన జాదవ్ మారుతి అప్పులబాధతో సోమవారం విద్యుత్ వైర్లు పట్టుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై పి.రవీందర్ తెలిపారు. మృతుడు తనకున్న ఎకరంనర భూమిని సాగు చేసుకుని ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రెండేళ్ల క్రితం రూ.3 లక్షల వరకు బ్యాంకు, ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పుచేసి కూతురు వివాహం చేశాడు. అప్పులు ఎలా తీర్చాలని రెండు రోజులుగా మదన పడుతున్నాడు. సోమవారం పల్సి తండా వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కి వైర్లు పట్టుకోవడంతో విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందాడు. మృతుని భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



సంఘటన స్థలంలో మృతదేహం

విద్యుదాఘాతంతో ఐదు గేదెలు మృతి

ఖానాపూర్: మండలంలోని బాదన్‌కుర్తి పంచాయతీ పరిధిలోని చింతల్‌పేట్ గోదావరి తీరంలో విద్యుదాఘాతంతో ఐదు గేదెలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన కాపరులు నర్సయ్య, కొండ రాజేశ్వర్ ఆదివారం గేదెలను మేతకు తీసుకెళ్లగా గోదావరి నీటిలో దిగిన సమయంలో సమీపంలోని ఒడ్డున గల మోటార్‌ల నుంచి వాటికి విద్యుత్ సరఫరా కావడంతో ఐదు గేదెలు మృతి చెందాయి. ఒక్కో గేదె విలువ రూ.50 వేలు ఉంటుందని గేదెల యజమానులు ఏ శంకర్, నాగుల రాజాగౌడ్, అలిశెట్టి బుచ్చన్న, అలిశెట్టి లచ్చ న్న, గొల్లపెల్లి నర్సయ్య పేర్కొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

తాంసి: భీంపూర్ మండలంలోని తాంసి(కె) శివారులో నుంచి ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు భీంపూర్ ఎస్సై కలీం తెలిపారు. అనంతరం మైనింగ్ అధికారులకు సమాచారం అందించారు. కొంత కాలంగా పెన్‌గంగ నది ఇసుకను తవ్వి మహారాష్ట్రకు తరలిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముడుపులు అందించడంతోనే ఇసుక దందా యథేచ్ఛగా కొనసాగుతుందని ప్రచారం జరుగుతోంది.

పెన్‌గంగలో ఒకరి గల్లంతు



శివ అలియాస్ కార్తీక్ (ఫైల్)

జైనథ్: మండలంలోని డొల్లార గ్రామ సమీపంలో పెన్‌గంగలో ఓ యువకుడు గల్లంతైనట్లు పోలీసులు తెలిపారు. ఆదిలాబాద్ రూరల్ మండలం చాంద(టి) గ్రామానికి చెందిన కే.శివ అలియాస్ కార్తీక్, జైనథ్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన కట్కం అక్షయ్, రాచర్ల రఘు ఆదివారం మహారాష్ట్రలోని పాండర్‌కొడకు వెళ్లారు. రాత్రి తిరుగు ప్రయాణంలో డొల్లార వద్ద పెన్‌గంలో నది ఒడ్డును కూర్చొని మద్యం సేవించారు. మద్యం మత్తులో శివ, రఘు ఒకరికి తెలియకుండా మరొకరు పెన్‌గంగలో స్నానానికి దిగారు. కొంత సేపటి తరువాత రఘు బయటకు వచ్చి చూడగా అక్షయ్ మాత్రమే కనిపించడంతో శివ గురించి అడిగాడు. అయితే శివ కూడ నదిలోనే దూకాడని తెలియడంతో మద్యం మత్తులోనే అతడి కోసం గాలించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సోమవారం కేసు నమోదు చేసుకొని ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాల ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు. శివ పెన్‌గంగలో గల్లంతయ్యాడా? లేదంటే ఇంకా ఏమైన జరిగి ఉంటుందా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సోమవారం ఎస్పీ గౌస్ ఆలం సంఘటన స్థలానికి చేరుకొని, వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాత్రి వరకు గాలింపు చర్యలు ముమ్మరంగా నిర్వహించినప్పటికీ కూడ శివ ఆచూకీ లభించనట్లు సీఐ సాయినాథ్ తెలిపారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై పురుషోత్తం పేర్కొన్నారు.

బ్యాంకులో సొమ్మసిల్లి పడిపోయిన రైతు

ఇంద్రవెల్లి: రుణమాఫీ డబ్బుల కోసం బ్యాంక్‌కు వచ్చిన రైతు అక్కడే సొమ్మసిల్లి పడిపోయిన సంఘటన మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకు ఆవరణలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం సమాక గ్రామ పంచాయతీ పరిధిలోని పాటగూడ(కే) గ్రామానికి చెందిన సిడాం రాజు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అతనికి రుణమాఫీ కావడంతో కుమారుడు లక్ష్మణ్‌తో కలిసి సోమవారం బ్యాంక్‌కు వచ్చి అక్కడే సొమ్మసిల్లి పడిపోయాడు. తన తండ్రి పరిస్థితి బ్యాంక్ అధికారులకు వివరించినా తీసుకురావాలని చెప్పడంతో గ్రామానికి వెళ్లి మంచంపై అనారోగ్యంతో పడుకుని ఉన్న వ్యక్తిని ఆటోలో తీసుకువచ్చానని లక్ష్మణ్ ఆరోపించాడు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

దిలావర్‌పూర్: దిలావర్‌పూర్ బస్టాండ్ వద్ద నిర్మల్–భైంసా రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒల్లెపు సాయవ్వ (70) మృతి చెందింది. నర్సాపూర్(జి) మండలంలోని రాంపూర్‌లో ఉన్న బంధువుల ఇంటికి రాగా ఆమె మనుమడు రాజు ద్విచక్రవాహనంపై స్వర్ణ గ్రామానికి తీసుకెళ్తుండగా కారు ఢీకొట్టింది. ఘటనలో వృద్ధురాలి తలకు బలమైన గాయం కావడంతో నిర్మల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రాజేశ్వర్‌గౌడ్ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నిర్మల్ రూరల్: కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వెనుక ఉన్న డ్రెయినేజీలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి (35) మృతదేహం లభ్యమైనట్లు రూరల్ ఎస్సై సాయికుమార్ తెలిపారు. మృతుడు నల్లరంగు ప్యాంటు, నీలంరంగు చొక్కా ధరించి ఉన్నాడన్నారు.

ఇద్దరు దొంగల రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: మార్కెట్ యార్డులో చోరీకి పాల్పడిన ఇద్దరు దొంగలను టూటౌన్ పోలీసులు అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ కరుణాకర్ రావు తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని వడ్డెర కాలనీకి చెందిన పాత నేరస్తుడు టింపు సురేష్, దొడ్ల మల్ల య్య అలియాస్ పాప ఈనెల 11న రాత్రి మా ర్కెట్ యార్డులోని ఆరు గోదాముల తాళాలు పగలగొట్టారు. పాత సామాగ్రి, నల్లాలు దొంగిలించి రూ.6వేలకు విక్రయించారు. ఫింగర్‌ప్రింట్స్ ద్వారా నేరస్తులను గుర్తించి అరెస్టు చేశారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన సుంకరి వెంకటి (70) సోమవారం మృతి చెందినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. శుక్రవారం కాలనీలోని ఓ ఆలయం వద్ద కిందపడి ఉన్న వృద్ధుడిని 108లో రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు.

'సదర్మాట్'కు పోటెత్తిన వరద



ఖానాపూర్: మేడంపల్లిలోని సదర్మాట్ ఆనకట్టకు జలకళ సంతరించుకుంది. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువనుంచి వరద నీరు వచ్చి చేరుతోంది. సదర్మాట్ ఆనకట్ట నీటి సామర్థ్యం 12 ఫీట్లు కాగా ప్రస్తుతం 9 ఫీట్ల వరకు ఉంది. దీంతో సదర్మాట్‌ను చూసేందుకు వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు తరలివస్తున్నారు.

లక్ష్మీపూర్ రిజర్వాయర్‌కు జలకళ



జైనథ్: మండలంలో 7,600 ఎకరాల ఆయకట్టు కలిగిన లక్ష్మీపూర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు జలకళ సంతరించుకుకుంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పిప్పల్‌గావ్ వాగు పొంగి పొర్లుతుండటంతో ప్రాజెక్ట్‌లోకి నీళ్లు వచ్చి చేరుతున్నాయి. 250.6 మీటర్ల ఎత్తు, 153 ఎంసీఎఫ్‌టీ నీటి నిల్వ సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో ప్రస్తుతం 243 మీటర్ల ఎత్తులో 25 ఎంసీఎఫ్‌టీ నీళ్లు నిల్వ ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ మీ పిల్లల బంగారు భవిష్యత్తు కొరకు 1లక్షకే 121చ॥గజాల ప్లాటు 20 మొక్కలతో... ఎర్ర చందనం మహాగని. ఫ్రీ మెయింటెనెన్స్ 10 సం॥లలో లక్షల్లో ఆదాయం Cont: 8500664291 [H-796100]

SERVICES

TO-LET

■ 1200Sft నుండి 2400Sft వరకు కమర్షియల్ బిల్డింగ్ షాప్స్, బ్యాంక్, ఫైనాన్స్, ఆఫీసులకు అద్దెకు ఇవ్వబడును. ఇ.నెం. 8-544, శ్రీనివాస్ టాకీస్ దగ్గర, మేన్‌రోడ్, మంచిర్యాల. సంప్రదించండి సెల్: 9959957741, 9848578233 [K-1187164]

BUSINESS OFFER

■ ICF కార్పొరేషన్ అగ్రికల్చర్, బిజినెస్, పర్సనల్, ఎడ్యుకేషన్, ప్రాపర్టీ పైన అమౌంట్ ఇవ్వబడును. ఏజెంట్స్ & DMA కావలెను. జీతం + కమీషన్. ఫోన్ 7988242391 [H-189696]

WANTED

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217 [M-1185359]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888, 9010299065,
9951602823, 9010608462,